BHARATH SAMACHAR DIGITAL

24, నవంబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

అలింకో సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం



భారత్ సమాచార్, సిద్దిపేట జిల్లా: వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలిచి వారి రోజువారీ పనులను మరింత సులభతరం చేసేందుకు హుస్నాబాద్‌లో ఉచిత సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అలింకో సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 24న ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు తెలిపారు.

ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. వారికి అవసరమైన సహాయ పరికరాలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో అలింకో సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమవంతు సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమం గురించి సమాచారం చేరవేసి, వారు శిబిరానికి వచ్చేలా చూడాలని సూచించారు.

హుస్నాబాద్ మండల పరిధిలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై ఉచిత సహాయ పరికరాల పంపిణీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెన్న రాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి తోడ్పాటు అందడంతో పాటు వారి దైనందిన జీవనంలో ఇబ్బందులు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

© 2026 Bharath Samachar